క్లుప్తంగా

మెగా వైద్య శిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

చీపురుపల్లి: లయన్స్‌క్లబ్ చీపురుపల్లి శాఖ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని లయన్స్ క్లబ్ హాల్‌లో నిర్వ హించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమయ్యింది. శిబిరంలో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి వైద్యులు సేవలందించారు. చీపురుపల్లితో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన 142 మందికి బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. అలాగే పాఠశాలల విద్యార్థులకు నేత్ర, సాధారణ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. లయన్స్‌స్టార్స్ క్లబ్ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కె.తవిటిరాజు, ఎస్.సన్యాసిరావు, డి.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బొండపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలం నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10: 30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, అన్నిశాఖల అధికారులతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

మే 1 నుంచి వేసవి శిక్షణ శిబిరం

చీపురుపల్లి: పట్టణంలోని బాలభవన్ కేంద్రంలో రాష్ట్ర విద్యాశాఖ నేతృత్వంలో మే 1 నుంచి మే 30 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు బాలభవన్ డైరెక్టర్ డాక్టర్ సుంకరి రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు సాగే ఈ శిబిరంలో నృత్యం, చిత్రలేఖనం, సంగీతం విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 86397 59964, 95531 23447 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

బాధితుల ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

చీపురుపల్లి: పట్టణంలోని రుంకానవీధిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు ఇళ్లు దగ్ధమయ్యాయి. సర్వం కోల్పోయిన బాధితులకు వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలిచారు. ఇళ్ల నిర్మాణంలో సహకారం అందిస్తామని అప్పుడే వెల్లడించారు. చెప్పినట్లే బాధితుల కోసం ఇళ్ల నిర్మాణాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఇప్పటికే నిర్మాణాలకు అవసరమయ్యే ఇసుక, మెటల్ వంటి మెటీరియల్ సమకూర్చారు. భవిష్యత్ నిర్మాణపనుల్లో కూడా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి నుంచి సహకారం అందించనున్నట్లు నాయకులు స్పష్టం చేశారు.

చెరువు గట్టు నరికివేతపై ఫిర్యాదు

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో నాయడు చెరువు గట్టు నరికివేతపై అదే గ్రామానికి చెందిన రైతు తహసీల్దార్ ప్రసన్న రాఘవకు బుధవారం ఫిర్యాదు చేశారు. సుమారు 1200 ఎకరాల పంట భూమికి సాగు నీరు అందించే పురాతన చెరువు గట్టును తన పొలానికి వెళ్లేందుకు అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జేసీబీతో తవ్వించి రహదారి చేసుకున్నాడు. దీంతో చెరువుకు గండి పడే ప్రమాదం ఉందని రైతు సన్యాసినాయుడు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.తహసీల్దార్ వెంటనే స్పందించి సంఘటన స్థలానికి వీఆర్‌ఓ సూరిప్పడును పంపించారు. చెరువుగట్టును పరిశీలించి నివేదిక అందించాలని వీఆర్‌ఓకు సూచించారు.

దివాకర్ మృతి పార్టీకి తీరని లోటు

బొండపల్లి: బీసీ కమిషన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు పక్కి దివాకర్ మృతి తీరని లోటని రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంసీహెచ్ గౌరీశంకరరావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారని, ఆయన మృతి బీసీ కమిషన్‌తో పాటు పార్టీకి తీరని లోటని చెప్పారు.

కృష్ణారాయుడుపేటలో 'ఫ్యామిలీ డాక్టర్'


శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ రాజు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేటలో వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి కె.రాజు ఆధ్వర్యంలో బుధవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నిర్వహించిన శిబిరంలో 125 మందికి 104 వైద్య సిబ్బందితో కలిసి వివిధ వైద్య పరీక్షలు చేశారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రతీ గడపలో సంక్షేమ సంతోషం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి


ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం నెలకొందని, అసలైన ప్రజా ప్రభుత్వం అనే పథానికి సీఎం జగన్ నిర్వచనం చెప్పారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధి కుమ్మరబంజరి ప్రాంతంలో బుధవారం 'గడప గడప కు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కాలనీ వాసులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతీ కుటుంబానికి పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. అనంతరం కాలనీలో మహిళలు,రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి, వారి సమస్యలు తెలుసుకు న్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. గ్రామాల్లో అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్యలకు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సీఎం జగన్ ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షల వరకు తక్షణం మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో తాము గుర్తించిన, ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపిస్తున్నామని, అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు కూడా గ్రామాల్లో సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి వెంటనే నిధులు మంజూరు చేస్తామన్నారు. స్థానికంగా ఉన్న ఇళ్ల పట్టాల సమ స్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీఎం జగన్ ప్రతి ఇంటికీ పెద్ద కొడుకులా అండగా ఉంటు న్నారని, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రా రామస్వామి, ఎంపీటీసీ కృష్ణమూర్తి, పార్టీ నాయకులు మేలాస్త్రి అప్పారావు, గొరపల్లి రవికుమార్, వేపాడ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, పలువురు వార్డు మెంబర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై ఉపాధ్యాయులకు అవగాహన


మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీదేవి

వేపాడ: 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల పనితీరు, పరీక్ష పత్రాల మూల్యాంకనంపై నిర్వహించే సోషల్ ఆడిట్‌పై ఉపాధ్యాయులకు స్థానిక ఎమ్మార్సీ లో ఎంఈఓ జి.శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ వి.మోహనరావు సోషల్ ఆడిట్ విధానం, సంబంధిత వివరాలు యాప్‌లో నమోదు చేసే విధానం వివరించారు. ఎంఈఓ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో 'చదవడం మాకిష్టం' కార్యక్రమంతో పాటు వివిధ పోటీలు నిర్వహణపై సూచనలు చేశారు. దీనిపై ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయులతో హెచ్‌ఎం యాక్షన్ ప్లాన్ తయారు చేయించాలని చెప్పారు. విద్యార్థులు లైబ్రరీ నుంచి తీసుకెళ్లిన పుస్తకాలను ఇంటివద్ద వారి తల్లి దండ్రులకు చదివి వినిపించేలా చూడాలని, విద్యార్థులు చదివిన పుస్తకాలపై వారి అభిప్రాయాన్ని నోట్ పుస్తకంలో రికార్డు చేయాల్సి ఉందన్నారు.

బిందు సేద్యం లాభదాయకం


ఆలుగుబిల్లి గ్రామంలో డ్రిప్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

శృంగవరపుకోట/జామి: బిందు, తుంపర సేద్యం రైతులకు ఎంతో లాభదాయకమని, తక్కువ నీరు, తక్కువ విద్యుత్, తక్కువ కూలి ఖర్చుల తో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని ఏపీ ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ చెప్పారు. ఎస్.కోట మండలంలోని ఆలుగుబిల్లి గ్రామంలో, జామి మండలం అన్నంరాజుపేట గ్రామంలో రైతులకు రాయితీపై అందించిన డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సన్న,చిన్నకారు రైతులకు 90శాతం రాయితీపై డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలను అందిస్తోందని చెప్పారు. రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జామి, సపోట,మామిడి,చెరకు, పామాయిల్, కొబ్బరి, కూరగాయల సాగుకు బిందు,తుంపర సేద్య పద్ధతులు అనువైనవి అన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ యూనిట్లు కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉద్యానవనశాఖ అధికారి అనిత, ఎంఐఈ శ్రీనివాస్, వీఏఏలు శివ, జి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏపీఎం వెంకటరమణ

కొత్తవలస: మండలంలోని గనిశెట్టిపాలెం గ్రామంలో వెలుగు ఆధ్వర్యంలో మహిళా రైతులకు నవధాన్యాల సాగు,సేంద్రియ ఎరువుల తయారీపై ఏపీఎం ఏ.వెంకటరమణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. ఏపీఎం మాట్లాడుతూ రైతులు ఎక్కువగా పంటలకు రసాయన ఎరువులు,పురుగు మందులు వినియోగిస్తుండడంతో భూసారం తగ్గిపోతోందని, పంటకు మేలుచేసే కీటకాలు, సూక్ష్మజీవులు, పురుగులు నశించిపోతున్నాయని అన్నారు.చిరుధాన్యాల రైతులు పూర్తి స్థాయిలో సేంద్రియ ఎరువులు,రసాయనాలును వినియోగించాలని సూచించారు. జీవామృతం తయారీని ప్రయోగాత్మంగా వివరించారు. రైతులకు నవధాన్యాల విత్తనాలను ఉచితంగా అందజేశారు. వీఓఏ లక్ష్మి ,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రావ్య, డి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో పంటలకు మేలు

బొండపల్లి: పంటకు జీవామృతం ఎంతో మేలు చేస్తుందని సెంచూరియన్ యూనివర్సిటీ అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థినులు తాళ్లపూడి మౌనిక,హర్షిత, సత్యశ్రీ అన్నారు.మండలంలోని నెలివాడ గ్రామంలో మహిళా రైతులకు జీవామృతం తయారీతో పాటు దానిని ఏయే పంటలకు ఏవిధంగా, ఏమోతాదులో వినియోగించాలో బుధవారం అవగాహన కల్పించారు. జీవామృతం పంటలకు వాడటం ద్వారా తక్కువ ఖర్చుతో తెగుళ్లను నివారించడంతో పాటు,భూసారాన్ని కాపాడుకోవచ్చనొ తెలిపారు రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు.


బొండపల్లి: జీవామృతం తయారీపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థిని

పని దినాలు పెంచాలి


వేతనదారులతో కలిసి నిరసన తెలుపుతున్న శ్రీనివాస్

దత్తిరాజేరు: ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులకు ప్రస్తుతం కల్పిస్తున్న 100 పని దినాలను 200 రోజులకు పెంచాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద వేతనదారులతో కలిసి బు ధవారం నిరసన తెలిపారు. అనంతరం ఎంపీ డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో రెండు పూటలా పని చేయించడం సమంజసం కాదని అన్నారు. కొలతలతో సంబంధం లేకుండా వేతనదారులకు రోజుకు రూ. 600 వేతనం అందచేయాలని కోరారు.

మోదీని గద్దె దించే వరకు పోరాడదాం


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు శ్రీనివాస్

గజపతినగరం: పేదలపై భారాలు మోపుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇబ్బందులు పెడుతున్నా రని, ఆయనను గద్దెదించేందుకు ప్రజలంతా ముందుకురావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్ కోరారు. ప్రచారభేరీలో భాగంగా పురిటిపెంట గ్రామంలో ఉపాధి వేతనదారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రజా, ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. ప్రజలకు సంక్షేమాన్ని దూరం చేస్తోందని, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారని ఆరోపించారు. సీపీఎం నాయకులు సింహాచలం,సూర్యనారాయణ,శంకర్ రావు,గౌరి, వాణి తదితరులు పాల్గొన్నారు.

డీజల్,పెట్రోల్ ధరలు తగ్గించాలి

వేపాడ: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని గద్దెదించాలని సీపీఎం నేత చల్లా జగన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రచార భేరిలో భాగంగా వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో బుధవారం సీపీఎం నేతలతో కలిసి ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజల్,నిత్యావసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన గ్రామీణ విద్యార్థులు

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల ఫలితాలు బుధవారం సాయంత్రం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులు, ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు మెరిశారు. కేజీబీవీలు, మోడల్‌స్కూళ్లు, గురుకుల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయా విద్యాలయాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.
- సాక్షి నెట్‌వర్క్

సెకండియర్


ఎస్.జ్యోతిర్మయి, షికారుగంజి మోడల్ స్కూల్, బైపీసీ, మార్కులు: 940


ఎస్.వెన్నెల, కొత్తవలస కేజీబీవీ, ఎంపీసీ మార్కులు : 939


బూర శంకర్, చీపురుపల్లి ప్రభుత్వ కళాశాల, ఎంపీసీ, మార్కులు: 938


మునకాల ఉమ గుర్ల ప్రభుత్వ కళాశాల , ఎంపీసీ, మార్కులు: 959


ఎన్.తేజశ్విని, గర్భాం మోడల్ స్కూల్, ఎంపీసీ, మార్కులు: 956


ఆకుల యశ్వంత్‌కుమార్, చీపురుపల్లి ప్రభుత్వ కళాశాల, ఎంపీసీ, మార్కులు: 946


ఎస్.భార్గవి, ఎల్.కోట మోడల్ స్కూల్, ఎంపీసీ మార్కులు: 919


కె.ప్రసాద్, గజపతి నగరం ప్రభుత్వ కళాశాల, ఎంపీసీ, మార్కులు: 931


ఆర్.హారిక, గజపతి నగరం ప్రభుత్వ కళాశాల, ఎంపీసీ, మార్కులు: 934


ఎన్.రమ్యశ్రీ ఎల్.కోట మోడల్ స్కూల్, బైపీసీ, మార్కులు :715


భవానీ ప్రసాద్, గజపతినగరం ప్రభుత్వ కళాశాల, హెచ్ఈసీ, మార్కులు: 815


వైశాలి, గంట్యాడ కేజీబీవీ, బైపీసీ, మార్కులు: 912


కె.జ్యోతిక, గజపతినగరం ప్రభుత్వ కళాశాల, ఎంపీసీ, మార్కులు: 912

ఫస్ట్ ఇయర్


రీలావాణి, గజపతి నగరం ప్రభుత్వ కళాశాల, ఎంపీసీ మార్కులు : 442


జె. సతీష్ షికారుగంజ మోడల్ స్కూల్ ఎంపీసీ మార్కులు : 439


డి.డిల్లీశ్వరి, కొత్తవలస కేజీబీవీ, ఎంపీసీ ప్రథమ సంవత్సరం మార్కులు: 436

ప్రజాభిప్రాయసేకరణ


మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి రెవెన్యూలో సర్వే నంబర్ 187-2లో హెక్టార్ విస్తీర్ణంలో మెసర్స్ సత్య స్టోన్ క్రషర్ మైనింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన క్వారీ లీజు పునరుద్ధరణపై మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం ప్రజాభిప్రాయసేకరణ చేశారు. ఏడు గ్రామా ల పరిధిలో ఈ క్వారీ విస్తరించి ఉంది. ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ క్వారీ వల్ల తమకు ఎటువంటి ఇబ్బందులు లేవని, క్వారీలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని,యువతకు క్రీడా పరికరాలు అందించాలని కోరారు. విజయనగరం జిల్లా డీఆర్‌ఓ ఎం.గణపతిరావు మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ సుదర్శన్, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, క్రషర్ పీఆర్‌ఓలు జె.రామారావు, సురేంద్ర, గరుడుబిల్లి, ఒంపల్లి, కొండకిండాం, అంబటివలస గ్రామాల నాయకులు బొద్దల చిన్నంనాయుడు, లండా నారాయణమ్మ, పెద్దమజ్జి గోపి, తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలు, కృత్రిమ అవయవాలకు గుర్తింపు


మాట్లాడుతున్న సీఐ బాలసూర్యారావు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆవరణలో కోల్‌కత్తాకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ లోకో మోటారు డిజెబిలిటీ (ఎన్ఐఎల్‌డీ) ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు, కృత్రిమ అవయవాలకు గుర్తింపు శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీఐ బాలసూర్యారావు ప్రారంభించారు. విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలకు చెందిన దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వీరిలో 484 మందిని వివిధ ఉపకరణాలకు గుర్తించినట్లు ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు తెలిపారు. ఈ శిబిరం గురువారం కూడా కొనసాగనుందని చెప్పారు. సీఐ బాలసూర్యారావు మాట్లాడుతూ ఎందరో దివ్యాంగులకు కొత్త జీవితాలను గురుదేవా చారిటబుల్ ట్రస్టు ప్రసాదించింద న్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో దివ్యాంగులకు ఉత్తమ సేవలందిస్తున్న ఏకైక సంస్థ గురుదేవ ట్రస్టు ఒక్కటే అని కొనియాడారు. ఎన్ఐఎల్‌డీ ప్రతినిధి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మే3 వరకు గ్రామదేవతల పండగ


పండగ పోస్టర్లను విడుదల చేస్తున్న గ్రామపెద్దలు

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారం, కొత్తఅగ్రహారం, రిక్షాకాలనీల్లో గ్రామదేవతల పండగను ఈనెల 27వ తేదీ నుంచి మే 3 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొసిరెడ్డి రమణ, మహేష్, లక్ష్మణ తెలిపారు. ఈ మేరకు పండగకు సంబంధించిన కరపత్రాలను బుధవారం రాత్రి విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 27న గురువారం రిక్షాకాలనీలో భూలోకమ్మవారికి, ఈనెల 30న ఆదివారం జి.అగ్రహారంలో కనకమహాలక్ష్మి అమ్మవారికి, మే2న జి.అగ్రహారంలో పైడితల్లి అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించనున్నట్లు చెప్పారు.మే 3న కనుమ పండగ ఉంటుందని, దశాబ్దం తర్వాత నిర్వహించనున్న ఈ పండగకు పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

బీమాతో కుటుంబానికి భరోసా


వేతనదారులకు అవగాహనకల్పిస్తున్న ఏపీజీవీబీ మేనేజర్ అజిత్‌కుమార్

వేపాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాల్లో చేరితే కుటుంబానికి భరోసా దక్కుతుందని స్థానిక ఏపీజీవీబీ మేనేజర్ కె.అజిత్‌కుమార్ అన్నారు. మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలో ఉపాధి వేతనదారులకు బీమా పథకాలు, బ్యాంకుసేవలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకులో తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు ప్రధానమంత్రి సురక్ష యోజన పథకం కింద ఏడాదికి రూ.20 చెల్లిస్తే, సదరు వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబానికి రూ.2లక్షలు బీమా వర్తిస్తుందని చెప్పారు. జీవన జ్యోతి యోజన పథకం కింద ఏటా రూ.436 చెల్లిస్తే, సదరు వ్యక్తి సహజ మరణం పొందినా రూ.2లక్షల బీమా సొమ్ము అందజేస్తామన్నారు. ప్రతీ ఏడాది ఆటో డెబిట్ ద్వారా ప్రీమియం చెల్లించే అవకాశముందన్నారు. సర్పంచ్ బాలబాబు, ఐకేపీ వీఓ ఏ.లీల తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ కె.ఎస్.ఎన్.వి.పట్నాయక్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, తదితర రికార్డులను పరిశీలించారు. ప్రజా సమస్యలు, వినతులు, వాటికి చూపించిన పరిష్కారాలపై సిబ్బందిని ఆరా తీశారు. సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. సారవానిపాలెం వెళ్లే రోడ్డులో గెడ్డవద్ద బ్రిడ్జిలేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీ దాయిరి ముత్యాలమ్మ ఎంపీడీఓ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పంచాయతీ కార్యదర్శి పద్మ, సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులతో కలిసి గెడ్డను ఎంపీడీఓ పరిశీలించారు. గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి ఐటీడీఏ అధికారులకు నివేదిస్తామని ఎంపీడీఓ పట్నాయక్ తెలిపారు.

అర్హతే ప్రామాణికం


గుర్ల: పాలవలసలో పథకాలను వివరిస్తున్న నాయకులు సన్యాసినాయుడు, తదితరులు


వేపాడ: కొండగంగుబూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు


గజపతినగరం: పురిటిపెంటలో పథకాలు వివరిస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

గుర్ల: అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమపథకాలు అందిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలంతా దీవించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు కోరారు. 'జగనన్నే మా భవిష్యత్- మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

జగనన్నకు మరో అవకాశం ఇవ్వండి

వేపాడ: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ముఖ్యమంత్రిగా వచ్చే ఎన్నికల్లో మరో అవకాశం ఇవ్వాలని ప్రజలను ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు కోరారు. కొండగంగుబూడి గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి 'జగనన్నే మా భవిష్యత్- మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ దాయిరి ముత్యాలమ్మ, సర్పంచ్ బంగారయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గబాబు, నాయకులు అప్పలసత్యనారాయణ, కన్నబాబు,సింహాద్రప్పడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం వివరిస్తూ...

గజపతినగరం: గజపతినగరం మండలం పురిటిపెంట న్యూకాలనీలో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమాన్ని సర్పంచ్ శొంఠ్యాన విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ పాలనపై ప్రజాభిప్రాయం సేకరించి ప్రజా మద్దతు పుస్తకాల్లో వివరాలు నమోదు చేశారు.